ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శనివారం 22 జూన్ 2024



నర్సరీల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

» జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మరియన్న

కురవి, జూన్21 : నర్సరీల నిర్వహణకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న సూచించారు. కురవి మండలంలోని నర్సరీలను, చింతపల్లి, కొత్తూరు (సి), బీచరాజుపల్లి, తానంచెర్ల, బూర్హాన్‌పురం గ్రామాల్లో నర్సరీలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి అనితశ్రీ, రైతులు పాల్గొన్నారు.



ఘనంగా యోగా డే

కోర్టులో యోగా చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్ ప్రసాద్

6

పెద్దవంగరలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



'సార్'కు నివాళి

» జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి
» తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలను కొనియాడిన వక్తలు

6




సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

» సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

మహబూబాబాద్ టౌన్, జూన్ 21 : కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం సీపీఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికి సీట్లు, ఓట్లు తగ్గాయని అందుకు బీజేపీ ప్రభుత్వం అవలం బించిన ప్రజావ్యతిరేక విధానాలే కారణమని చెపారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరారు. రాబోయే కాలంలో ప్రజాసమ స్యలపై ఉద్యమాలను తీవ్రతరం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, శెట్టి వెంకన్న, అల్వాల వీరయ్య, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, మండ రాజన్న, సమ్మెట రాజమౌళి పాల్గొన్నారు.



పోలీస్ పోస్టింగ్.. పరేషాన్!

- పాత స్థానాల్లోకి మళ్లీ వచ్చేందుకు పలువురి ఆసక్తి
- ప్రస్తుత స్టేషన్లలోనే కొనసాగాలి అనుకుంటున్న కొందరు..
- పైరవీల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
- ఎస్ఐల నుంచి ఏసీపీల వరకు ఎవరి ప్రయత్నాల్లో వారు
- ఇదే అదనుగా రంగంలోకి దళారులు
- పోస్టింగుకో రేటు ఫిక్స్..
- నగర శివారుల్లోని స్టేషన్లకు ఫుల్ డిమాండ్
- సిఫారసు లేఖ లేకుంటే ఎంత సిన్సియర్‌గా జాబ్ చేసినా లూప్ లైన్‌కేనని చర్చ

ఎన్నికల కోడ్ ముగియటంతో పైరవీలు మొదలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పోలీసుల్లో బదిలీల టెన్షన్ మొదలైంది. ఎన్నికల కోడ్ ముగియడంతో తమను ఎక్కడికి బదిలీ చేస్తారోనన్న ఆందోళన కనిపిస్తోంది. దీంతో సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంచి చోట పోస్టింగ్ ఇప్పిస్తే భారీగా నజరానాలు ఇచ్చేందుకు సిద్ధమవు తున్నారు. ఎస్ఐల నుంచి ఏసీపీల వరకు తాము కోరుకున్న పోస్టింగ్‌ల ఇప్పించేలా పైరవీ చేయా లంటూ తిరుగుతున్నారు. అయితే ఎన్నికలకు ముందు పైరవీలతో పోస్టింగ్ కొట్టిన కొందరు మూడు రోజులు తిరగకముందే ఎన్నికల కోడ్ పేరుతో బదిలీ అయ్యారు. వారిలో చాలామంది నాటి తమ పోస్టులు తిరిగి తమకే ఇవ్వాలని నేతలపై ఒత్తిడి తెస్తుండగా, ప్రస్తుతం డ్యూటీల్లో ఉన్న అధికారులు ఇక్కడే కొనసాగేలా నేతలపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో నేతలు ఎవరికి సిఫార్సు లేఖలు ఇస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

ఐఏఎస్, ఐపీఎస్‌లతో బదిలీలు షురూ..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రభుత్వం ఎన్నికల ముందు జిల్లాలో మూడేళ్లకు పైగా పని చేసిన వారిని, సొంత జిల్లాలో పని చేసినవారిని బదిలీ చేసివారి స్థానంలో కొత్త వారిని నియమించింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో పరిపాలనపై దృష్టి పెట్టిన ప్రభుత్వం గత ప్రభుత్వం నియమించిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలను బదిలీలు చేసింది. ఇందులో భాగంగా దీంతో ఈ నెల 15వ తేదీన ఉమ్మడి జిల్లాలోని భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లను బదిలీ చేసింది. వరంగల్ వెస్ట్ (జనగామ), వరంగల్ సెంట్రల్ డీసీపీలకు కూడా స్థానం చలనం జరిగింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టడంతో తరువాత కిందిస్థాయి అధికారుల బదిలీలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఎస్ఐ, సీఐ, డీఎస్పీల బదిలీపై అధికార పార్టీ నేతలు దృష్టిసారించారు. దీంతో రెండుమూడు రోజుల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

దళారుల రంగ ప్రవేశం!

బదిలీల పర్వం మొదలవటంతో మంచి పోస్టింగ్ కోసం నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు, నేతలు ఖాకీల పనితీరు కంటే సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది. సామాజిక వర్గం అధికారులు లేకుంటే సమర్థత, విశ్వసనీయత, పనితీరు, పాత పరిచయాలు తదితర అంశాలను బేరీజు వేసుకుంటున్నారనే అభిప్రాయాలున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు మహ బూబాబాద్, భూపాలపల్లి జిల్లాలో ఇచ్చే పోస్టిం గుల్లో ఎక్కువ శాతం తమ సామాజిక వర్గానికి చెందిన అధికారులకే సిఫార్సులు చేస్తున్నారనే చర్చ జరుగుతుండగా మరికొన్ని చోట్ల పోస్టింగుకో రేటు ఫిక్స్ చేసి దళారులతో బేరసారాలకు దిగుతు న్నారనే ప్రచారం ఉంది. వరంగల్ నగరం సమీపం లోని ఓ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పోలీస్ స్టేషన్లకు భారీగా ధర పలుకుతుందనే చర్చ సాగు తోంది. నగరం నడిబొడ్డున ఉన్న ఓ ఏసీపీ పోస్టిం గ్ కోసం పొరుగు జిల్లా మంత్రితో ఓ అధికారి పైరవీలు చేస్తున్నారని సమాచారం. పరకాల నియోజకవర్గం పరిధిలో రెండు స్టేషన్లలో పోస్టిం గుల విషయంలో ముగ్గురు నేతలు వేర్వేరుగా సిఫార్సులు చేస్తున్నారని సమాచారం. నగర పరిధిలో ఉండే నాలుగైదు స్టేషన్లలో పోస్టింగ్ కోసం భారీగా క్యూ కడుతున్నారని తెలుస్తోంది.



మా కుర్చీ మాకే కావాలి..

పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి నెలలో ఉమ్మడిజిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు జరిగాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు సూచించిన వారికి పోస్టింగులు దక్కాయి. ఆ సమయంలో కొందరు నేతలు భారీగా తీసుకుని పోస్టింగులు ఇప్పించారని, కొన్నిస్టేషన్ల ఎస్‌హెచ్‌వోల పోస్టింగులకు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు చేతులు మారాయని ప్రచారం జరిగింది. అయితే ఫిబ్రవరిలో విధుల్లో చేరిన కొంతమంది అధికారులకు మార్చిలో జరిగిన బదిలీల్లో స్థానచలనం తప్పలేదు. అప్పటికే సిఫార్సు లేఖల కోసం భారీగా సమర్పించుకున్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం కోడ్ ముగియటంతో మళ్లీ తమ పాత స్థానాలు తమకే ఇప్పించాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. అయితే ఆ పోస్టు ఆ సిఫార్సు లేఖ వరకే అని.. మళ్లీ పోస్టు కావాలంటే ఆలోచిస్తామంటూ వరంగల్ నగర సమీపంలోని ఓ నేత ఖాకీలను ఇంటి చుట్టూ తిప్పుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా వేరే అధికారులకు పోస్టింగులు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దళారులు రంగంలోకి దిగి బేరసారాలు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో తమ పాత పోస్టింగ్ వస్తుందా..లేదా అనే టెన్షన్‌లో కొందరు పోలీసులు ఉండగా, ఎన్నికల బదిలీల్లో వచ్చిన అధికారులు కొందరుఅదే స్టేషన్‌లో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట. తమకున్న పరిచయాలతో ఆయా ఏరియాల్లోని కీలకనేతలపై ఒత్తిడి తెస్తున్నారట. ఇలా పోస్టింగుల కోసం జరుగుతున్న ఫైటింగ్‌లో కుర్చీ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ ఖాకీల్లో నెలకొంది.

సిఫారసు లేకుంటే లూప్‌లైన్‌లోకే..

పోలీసు శాఖలో నిజాయితీగా పని చేసే కొంతమంది అధికారులకు లూప్ లైన్ డ్యూటీస్ తప్పటం లేదు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్పీ స్థాయి అధికారి బదిలీ వరకు పైరవీలు నడుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అన్ని శాఖల కంటే పోలీస్ శాఖలోనే అధికంగా బదిలీలపై రాజకీయ ఒత్తిళ్ల ఉంటాయనే అభిప్రాయాలు ఉన్నాయి. దీంతో నిజాయితీగా విధులు నిర్వహించే కొంతమంది అధికారులు, పైరవీలు చేయటం ఇష్టం లేని అధికారులకు లూప్ లైన్ డ్యూటీలు తప్పవనే చర్చ జరుగుతోంది. అనేక మంది పోలీసు అధికారులు నిజాయితీగా పని చేసినా, రాజకీయ పలుకుబడి లేకపోవటంతో లూప్ లైన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సిఫార్సు లేఖలకు కాకుండా బాధ్యతయుతంగా పని చేస్తున్న వారిని గుర్తించి పోస్టింగులు ఇవ్వాలనే డిమాండ్ కొందరు పోలీసుల నుంచి వినిపిస్తోంది.



ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

» జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 21 : జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం విక్రయిస్తే చ్చపరమైన చర్యలు ఉంటాయని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన ఎలాంటి వస్తువులు విక్రయించినా జీవో 01 ప్రకారం ఆ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వర్షాలు కురవాలని అడవితల్లికి వేడుకోలు

గూడూరు, జూన్ 21 : వర్షాలు సకాలంలో సమృద్ధిగా పడి పంటలు పండాలని గూడూరు శివారు గొల్లగూడెంకు చెందిన కురుమ కులస్తులు శుక్రవారం అడవితల్లిని వేడుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం వనభోజనాలకు వెళ్లారు. వనభోజనాలు చేసిన అనంతరం మహిళలు కప్పతల్లిపాటలు, కోలాటాలు, నత్యాలు చేశారు. అడవితల్లిని పూజించడం ద్వారా వర్షాలు పడుతాయని వారు చెప్పారు. కులపెద్దలు మండల కొమురయ్య, ఉపేందర్, కుండె కిషన్, చీర బిక్షపతి, కోరె పాపయ్య, మండల శ్రీనివాస్, మండల మల్లేష్, అనిల్ పాల్గొన్నారు.



వర్షాలు కురువాలని నృత్యం చేస్తున్న మహిళలు



దామరవంచ గిరిజన గురుకుల పాఠశాలలో మొక్కను నాటుతున్న జాటోతు హుస్సేన్‌నాయక్

విద్యార్థులకు చదువే ఆయుధం

» జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్

గూడూరు, జూన్ 21 : విద్యార్థులకు చదువే ఆయుధమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాల, బ్రహ్మణపల్లి కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం హుస్సేన్‌నాయక్ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పేదరికం చదువుకు అడ్డుకాదని, చదువులో రాణిస్తే పేదరికం దూరమవుతుందన్నారు. తొలుత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మచ్చర్ల గ్రామానికి చెందిన సీఆర్టీ ఉపాధ్యాయుడు చుంచా దేవేందర్ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దేవేందర్ భార్య భారతికి ఉద్యోగం ఇప్పించేందుకు ఐటీడీఏ అధికారులతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. ఆర్సీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ప్రిన్సిపల్ ముత్తయ్య, ఎంఈవో శ్రీదేవి, ఎంఎస్‌వో రవికుమార్, ఎస్‌వో సునిత, బీజేపీ నాయకులు చెల్పూరి వెంకన్న, మల్లేష్, మోతీలాల్, రాంబాబు, కొమ్మాలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య, ఆరోగ్య, పంచాయతీ, మునిసిపల్, విద్యా, సంక్షేమశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ వ్యాధులు ప్రబలకుండా అరికట్టాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనులను సక్రమంగా చేపట్టి ప్రజలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా రోగాలను అరికట్టాలన్నారు. డ్రైయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని చెప్పారు. నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయాలని, దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలని తెలిపారు. వారానికి రెండురోజులు డ్రైడేను పాటించాలని అన్నారు. వర్షాకాలంలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత లోపించడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందడం కారణంగా వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని దీన్ని దృష్టిలో పెట్టుకుని పారిశుధ్యం పట్ల ప్రజలకు అవవగాహన కల్పించాలన్నారు.

గ్రామాల్లో పంచాయతీరాజ్, అంగన్‌వాడీ, ఆశా, స్వయం సహాయక సంఘాలతో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పట్టణాల్లో మునిసిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకుని వార్డుల్లో ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోజు వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేసి నివేదికలు రూపొందించి అందజేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, జిల్లా అధికారులు నర్మద, ఎర్రయ్య, వరలక్ష్మి, హరిప్రసాద్, బాలరాజు, శ్రీనివాసరావు, రామారావు, ఎం.కిషన్‌రెడ్డి, శాంతికుమారి, అంబరీష, మునిసిపల్ కమిషనర్లు నరేందర్, నరేష్‌రెడ్డి, రంజిత్, ప్రోగ్రాం అధికారులు బిందుశ్రీ, సుధీర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, కేవీ. రాజు, పురుషోత్తం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌లో మొక్కజొన్న విత్తనాలు

» ఎంకే 30 రకం కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

గంగారం, జూన్ 21 : మండలంలో ఎంకే 30 రకం మొక్కజొన్న విత్తనాల కొరత ఏర్పడింది. ఈ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు వ్యాపారులు తరలించటంతో గంగారం మండలంలో గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దానికి బదులు నాసీ రకం విత్తనాలను వ్యాపారులు విక్రయించటంతో ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంటే గిరిజన రైతులకు ప్రధాన జీవనాధారం. 18వేల ఎకరాల మేర మండలంలో పంటను సాగుచేస్తున్నారు. ఎకరానికి 6నుంచి 8 కేజీల విత్తనాలు విత్తాల్సి ఉంటుంది. ఈ లెక్కన మండలానికి 14 వందల క్వింటాళ్ల అవసం ఉంటుంది.

ఇక్కడ వర్షాధార భూములు కావటంతో అధిక వానలు కురిసినా, తక్కువ వర్షపాతం నమోదైనా ఎంకే 30 మొక్కజొన్న విత్తనాలైతేనే అధిక దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం. ఎంకే 30 రకం నాలుగు కేజీలకు రూ.1100 నుంచి రూ.1300 వరకు ధర ఉంది. ఈ విత్తనాలకు గంగారంలో డిమాండ్ పెరగటంతో వ్యాపారులు మొక్కజొన్న విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించారని గిరిజనులు వాపోతున్నారు. దీంతో ఎందుకు పనికిరాని నాసిరకం విత్తనాలు (తక్కువ ధరవి) తీసుకొచ్చి అధికధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు పడి మొక్కజొన్న సాగుకు కాలం అనుకూలంగా ఉంది. రైతు బలహీనతలను ఆసరా చేసుకున్న విత్తన వ్యాపారులు రూ.900లు ధర పలికే నాసీరకం విత్తనాలను తీసుకువచ్చి రూ.1800లకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఎంకే 30 రకం విత్తనాలు బ్లాక్ మార్కెట్‌లో రూ.2000లకు విక్రయిస్తున్నారని గిరిజనుల చెబుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ వ్యవసాయశాఖ అధికారి ఉదయ్‌ని వివరణ కోరగా, ఎంకే 30 మొక్కజొన్న విత్తనాలు కొరత ఉందన్నారు. దానికి బదులు వేరే విత్తనాలను వ్యాపారులు విక్రయిస్తున్నారని అన్నారు. ఎంకే 30 రకం బ్లాకులో విక్రయిస్తే సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.



దేవాదాయశాఖ అధికారికి వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్థులు

రామాలయం రిజిస్ట్రేషన్‌పై వివాదం!?

» అభ్యంతరాల నోటీస్‌తో వెలుగులోకి » గంధంపల్లిగా పేరు మార్చాలని వినతి

బయ్యారం, జూన్ 21 : గంధంపల్లి-కొత్తపేటలోని రామాలయం రిజిస్ట్రేషన్ వివాదాస్పదంగా మారింది. తమ గ్రామంలో ఉన్న రామాలయంకు సంబంధించి పలువురు గతంలో దేవాదాయశాఖ రిజిస్ట్రేషన్ నిమిత్తం కొత్తపేట రామాలయంగా దరఖాస్తు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గంధంపల్లి గ్రామస్థులు, భక్తులు గురువారం దేవాదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి సునీతకు వినతిపత్రం అందజేశారు. గంధంపల్లి గ్రామస్థులు వెల్లడించిన వివరాల ప్రకారం. తమ గ్రామ పరిధిలోని రామాలయానికి సంబంధించి గతంలో పలువురు దేవాదాయశాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ నిమిత్తం చేసిన దరఖాస్తులో కొత్తపేట రామాలయంగా పేర్కొనడంపై

» మిగతా 6వ పేజీలో..

గ్రామస్థుల చైతన్యంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు



అదనపు గదుల నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జూన్ 21: గ్రామస్థుల చైతన్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయనడానికి ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలే నిదర్శనమని, ఆదిశగా గ్రామాల్లో పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ నిధులు రూ.18 లక్షలతో నిర్మించనున్న ఆదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మూతపడిన పాఠశాలను గ్రామస్థులు చైతన్యంతో తెరిపించుకోవడమే కాకుండా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ప్రైవేటు ఉపాధ్యాయులను ఏర్పరుచుకొని మంచి ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ గుర్తింపు పొందిన పాఠశాలను ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండుగా విభజించడంతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు (ఉపాధ్యాయులు) వస్తారని, అందుకు తనవంతుగా ప్రభుత్వం దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకెళ్తానని తెలిపారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. పాఠశాల పనితీరు అద్భుతంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం కృషి చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆదర్శవంతమైన ఈ పాఠశాలలో మౌలిక వసతులకై తన సీడీఎఫ్ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, నోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం రత్నకుమార్ అధ్యక్షత వహించగా తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కడుదూరి రాజు, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, అమ్మఆదర్శ కమిటీ ఛైర్మన్ సకీన, ఎస్ఎంసీ మాజీ ఛైర్మన్ పొన్నాల రాజు, నాయకులు సమ్మెట మహేందర్, ఎలిషా, గిరుక రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుంజేడు శ్రీ ముసలమ్మ గుడి ఆవరణలో భక్తుల కోలాహలం

గుంజేడు శ్రీముసలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

కొత్తగూడ, జూన్ 21: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టేముందు రైతులు శ్రీముసలమ్మ దేవతను దర్శించుకొని పంటలు బాగా పండాలని మొక్కుకోవడం, వాగు నీటిని తీసుకువెళ్లి వ్యవసాయ భూముల్లో చల్లుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగా రైతుల కుటుంబాలు అధిక సంఖ్యలో ముసలమ్మ జాతరకు తరలివచ్చారు. కుటుంబసమేతంగా ముసలమ్మ దేవతను దర్శించుకున్నారు. దీంతోపాటు పాఠశాలలు ప్రారంభం కావడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కుటుంబాలు, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కుటుంబాలు శ్రీముసలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలు తీసుకున్న భక్తులు గుడి వద్ద వాహన పూజలు చేశారు. అనంతరం ఆహ్లాదకరంగా అడవీలో వంట లు చేసుకుని వనభోజనాలు చేశారు. కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడిపారు.

అధికారుల తప్పులు.. టీచర్లకు తిప్పలు..

- ప్రహసనంలా ఉపాధ్యాయుల పదోన్నతులు
- గణితంలో నిబంధన తారుమారు
- సోషల్ అడిక్వసీలో ఒక పోస్టు గల్లంతు
- విద్యార్థులు లేని చోట పీడీలకు స్థానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 21: వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రహసనంలా మారింది. అధికారులు చేసిన తప్పులకు పంతుళ్లకు తిప్పలు తప్పడం లేదు. నిబంధనలు అధిగమించడం.. రోస్టర్‌ల ను తప్పుగా చూపించడం.. విద్యార్థులు తక్కువగా ఉన్న చోట పోస్టులను ఓపెన్ చేయడం లాంటి తదితర పొరపాట్లను అధికారులు చేయడం వల్ల పదోన్నతుల్లో కొంత మంది ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితోపా టు రోస్టర్ విధానంలో తలెత్తిన సాంకేతిక కారణంతో గురువారం రాత్రి వరకు ప్రభుత్వ విభాగంలోని పీఈటీ లు, స్థానిక సంస్థల విభాగంలోని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్ ఎంలు, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌ల పదోన్నతుల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. జిల్లాలోని విద్యాశాఖాధి కారులు తప్పుడు జాబితాలను రూపొందించడంతోనే పదోన్నతుల్లో కొందరు ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తుంటే ఉన్నతాధికారుల ఆదే శాల మేరకే జాబితాలను రూపొందించామని డీఈవో వాసంతి పేర్కొన్నారు.

గణితంలో నిబంధన తారుమారు

ప్రభుత్వ విభాగంలోని గణితం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో నిబంధనలను అధికారులు తారుమారు చేశారని సంబంధిత ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ విభాగంలో మొత్తం 5 క్లియర్ వేకెన్సీలతో జాబితాను రూపొందించారు. ఇందులో 70 శాతం పదోన్నతులతో, 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ఒక్క పోస్టును మాత్రమే పదోన్నతితో భర్తీ చేశారు. 4 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అధికారులు నోటిఫై చేయడంతో నిబంధనలను తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించాల్సి ఉండగా వారికి మొండిచేయి మిగిలింది.

ఎస్సీల పదోన్నతులు


స్థానిక సంస్థల విభాగంలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఎస్సీల విభాగంలో అడిక్వసీ ప్రకారం అధికారులు పదోన్నతులు నిర్వహించలేదని సంబంధిత ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిక్వసీ జాబితాలో 9 పోస్టులకు పదోన్నతి కల్పిస్తున్నట్లు జాబితాను రూపొందించిన అధికారులు 8 మందికి మాత్రమే పదోన్నతి కల్పించడంతో మరో ఉపాధ్యాయుడు పదోన్నతి పొందలేకపోయినట్లు వారు ఆరోపిస్తున్నారు. తమకు అడక్వసీ విషయంలో తనకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ఓ ఉపాధ్యాయురాలు డీఈవోకు వినతి పత్రం అందజేశారు.

రోస్టర్ పాయింట్లు తారుమారు

వికలాంగుల రోస్టర్ పాయింట్లలోనూ అధికారులు తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. స్థానిక సంస్థల విభాగంలోని తెలుగు ఎస్ఏ పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్ 6లో వీహెచ్ ఉమెన్‌ను కేటాయించాల్సిన చోట వీహెచ్ మెన్ రోస్టర్‌ను కేటాయించడంతో సదరు మహిళా ఉపాధ్యాయురాలుకు అన్యాయం జరిగినట్లు తెలుస్తోంది. ఆ మహిళా ఉపాధ్యాయురాలు డీఈవో కార్యాలయంలో ఈ విషయమై వినతి పత్రం అందజేశారు.

పోస్టులు బ్లాక్

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలోని స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉన్నతీకరణలోనూ అధికారులు తప్పులో కాలేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా ఉన్న చోట పీడీలు అవసరం ఉండగా అందుకు భిన్నంగా విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో అధికారులు పోస్టులను ఉన్నతీకరణ చేసి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో పోస్టులను బ్లాక్ చేశారు. ఖిలావరంగల్ మండలంలోని పలు పాఠశాలల్లో పీడీలు అవసరం ఉండగా వాటిని బ్లాక్ చేసి వరంగల్ మండల పరిధిలో తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలల్లో పీడీల పోస్టులను ఓపెన్ చేశారు. దీంతో అధికారుల తప్పిదంతో అవసరమున్న పాఠశాలల్లో పీడీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జాబితా

వరంగల్ డీఈవో డి.వాసంతి

పదోన్నతుల ప్రక్రియలో జిల్లాలో రూపొందించిన ప్రతీ జాబితా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రూపొందించాం. నిబంధనల మేరకు రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ సీనియారిటీ జాబితాలతో పాటు అప్‌గ్రేడ్ చేశాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో పీడీ పోస్టుల విషయంలో జరిగిన పొరపాటును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటిని సైతం ఉన్నతాధికారులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

అవసరం లేని చోట అప్‌గ్రెడేషన్

అవసరం లేని చోట అధికారులు ఎల్పీల పోస్టులను అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయుల తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం, రెండు తరగతులు మాత్రమే ఉన్న చోట్ల రోస్టర్ విధానం పేరుతో అన్యాయంగా అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయులు విమర్శలు చేస్తున్నారు. వరంగల్ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతుల్లో 15 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా అక్కడ ఎల్పీ పోస్టు అప్‌గ్రేడ్ అవసరం లేకున్నా అధికారులు అనవసరంగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తాం..

- అర్హులందరికీ పీఎం కిసాన్ అందేలా చర్యలు
- కొత్తకొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



కొత్తకొండలో స్వామివారికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

భీమదేవరపల్లి, జూన్ 21: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఎడాపెడా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తోందన్నారు. శుక్రవారం రాత్రి భీమదేవరపల్లి మండలానికి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చ కులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లించారు. వీరభద్రస్వామికి ప్రత్యేకంగా అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆలయ ఆవరణలో బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి సహకరించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత అందరూ అభివృద్ధిపై సహకరించుకోవాలన్నారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి పర్యాటక శోభ తీసుకువస్తామన్నారు. ఇందుకు అవసరమయ్యే నిధులను సమీకరిస్తామన్నారు. కొత్తకొండ దేవాలయ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికను రూపొందించాలని ఈవోను కోరారు.

కాగా, రాష్ట్రంలో 2019 తర్వాత వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ పీఎం కిసాన్ యోజన రావడం లేదని విలేకరులు ప్రశ్నించగా, ఈ విషయాన్ని ప్రధాని మోదీ, వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖతో మాట్లాడి విధి విధానాలు రూపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే భీమదేవరపల్లి ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దొంగల కొంరయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గుండెల్లి సదానందంయాదవ్, గోదల సంపత్, బండారి కరుణాకర్, అంబీరు కవిత, ఊసకోయిల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన ఎమ్డీ నజీర్ (47) మార్బుల్ టైల్స్‌లో కూలిపని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 17న కాజీపేట నుంచి హనుమకొండకు వెళ్తున్న క్రమంలో ఫాతిమా నగర్ వద్ద ఒక లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ లారీతో నజీర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నజీర్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎంలో చేర్పించారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నజీర్ భార్య అంజుమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: రాష్ట్రప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తోంది. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకుండా ఉన్నవారు అర్హులు. జూలై 10వ తేదీలోపు tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్ మోహన్ సూచించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లెక్చరర్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: తెలంగాణ మైనారిటీల గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ల పోస్టులు తెలుగు, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంతోపాటు పీజీటీ ఆంగ్లంలో అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 22 నుంచి 25 వరకు సాయంత్రం 4 గంటల లోపు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ : 80749 94073లో సంప్రదించాలని కోరారు.

జూలై 1 నుంచి ఎస్డీఎల్‌సీఈ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 21: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్సీ సైకాలజీ ఫైనల్ ఇయర్-2023 వార్షిక పరీక్షలు జూలై 1 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1, 3, 5, 8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జూలై 9 నుంచి 14 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని గ్రూపుల వారిగా కేటయించిన సమయంలో పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీపై తుమ్మలను కలిసిన టెస్కాబ్ చైర్మన్



మంత్రి తుమ్మలకు వివరాలను తెలియజేస్తున్న మార్నేని

హనుమకొండ సిటీ, జూన్ 21: రైతుల రుణమాఫీ అంశం విషయంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. సహకార బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 7,74,833 ఉన్నట్లు మంత్రికి వివరించారు. రైతులకు లబ్ధిచేకూరేలా నిర్ణయాలు తీసుకోవాలని రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే రవీందర్‌రావు, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య, డీసీసీ బ్యాంకుల చైర్మన్లు పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

వడ్డెపల్లి, జూన్ 21: మానవహక్కులపై జాతీయ స్థాయి. అవగాహన సదస్సు ఆదివారం ఉదయం 11గంటలకు హనుమకొండ ప్రెస్‌క్లబ్ ప్రాంతంలోని ఆదర్శ లా కాలేజీలో నిర్వహించనున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ రాష్ట్రకార్యదర్శి పోలెపాక మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు సంబంధించి న సంస్థ ప్రతినిధులందరూ ఈ అవగాహన సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

హనుమకొండ టౌన్, జూన్21: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసి బాధితులకు శుక్రవారం రాత్రి అప్పగించినట్లు ఇన్స్‌పెక్టర్ వై.సతీష్ వెల్లడించారు. సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్స్ గౌస్‌పాషా, వీరేందర్‌ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.



సీకేఎం కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా వేడుకలకు హాజరైన విద్యార్థులు, నగరవాసులు

యోగాతో రోజును ప్రారంభించాలి

త్రిదండి చిన్నజీయర్ స్వామి



మాట్లాడుతున్న త్రిదండి చిన్నజీయర్ స్వామి

పోచమ్మమైదాన్, జూన్ 21 : ప్రతీ ఒక్కరు యోగాతోనే తమ రోజును ప్రారంభించాలని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా వేడుకలకు ఆయన హాజయర్యారు. తొలుత హాజరైన వారితో యోగాసనాలు చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వతహాగా యోగా పై దృష్టి సారించాలన్నారు. నిరంతరం యోగా చేయడం ద్వారా వ్యాధులు దరి చేరవని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, డాక్టర్ మురళీకృష్ణ, తుమ్మ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంకు తప్పని విద్యుత్ కష్టాలు



ఎక్స్‌రే విభాగం వద్ద రోగులు

వరంగల్ మెడికల్, జూన్ 21: ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చిన రోగులకు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ వార్డులకు విద్యుత్ సరఫరా జరిగితే తప్ప విద్యుత్ ఉండదు. ఎమర్జెన్సీ వార్డుకు జనరేటర్ ద్వారా సరఫరా చేస్తున్నా సకాలంలో సిబ్బంది స్పందించకపోవడంతో అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం ఎంజీఎం క్యాజువాలిటీ విభాగంలోని ఎమర్జెన్సీ ఎక్స్‌రే విభాగంలో సుమారు గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. అంతేకాకుండా పలు వార్డులకు సైతం కరెంట్ వస్తు పోతూ ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామంలో పత్తి విత్తనాలు వేయగా వర్షం లేని కారణంగా మొలకెత్తకపోవడంతో నీళ్లు పోస్తున్న రైతు కుటుంబం

చూస్తూ ఉండలేక..

కరుణ చూపని వరుణుడు.. వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు

వర్షాలు ఊరిస్తున్నాయి. అడపాదడపా జల్లులు తప్ప సరైన వానలు లేకపోవడంతో వానాకాలం సాగు పనులు ముందుకు సాగడం లేదు. సాధారణంగా ఏటా జూన్ మొదటి వారంలోనే వర్షాలు ఆరంభమై సమృద్ధిగా కురిసేవి. కానీ, ఈ ఏడాది జూన్ ముగుస్తున్నా ఇంకా సరైన వర్షాలు పడటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేయగా వానలు లేక అవి మొలకెత్తే పరిస్థితి కనిపించడం లేదు. మొలకెత్తినవి కూడా వడబడుతున్నాయి. దీంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకులు, బిందెలతో నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలోని పలుప్రాంతాల్లో శుక్రవారం పలువురు రైతులు ఇలా మొక్కలకు నీరు పోయడం కనిపించింది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


అనిత మృతదేహం

మహబూబాబాద్ రూరల్, జూన్ 21 : మన స్తాపంతో ఉరివేసుకుని ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం సోమ్లతండాలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. సోమ్లతండాకు చెందిన గుగులోతు అనిత (35) భర్త గుగులోతు మంగు మూడేళ్లక్రితం మృతి చెందాడు. ఆమెకు కుమారుడు సాయి కృష్ణ, కుమార్తె ఉమ ఉన్నారు. గ్రామంలోనే ఉంటూ వ్యవసాయ కూలీనాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. అదే తండాకు చెందిన వరుసకు బావ అయిన గుగులోతు బిచ్చు ప్రతిరోజు అనిత ఇంటికి వచ్చి వెళ్తుండడంతో తండవాసులుఏమనుకుంటున్నారో అని మనస్తాపం చెంది గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకుపాల్పడినట్లు చెప్పారు. అనిత ఉరివేసుకున్నట్లుగా పక్క ఇంటి వారికి కన్పించడంతో అదేతండాకు చెందిన అనిత తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. తండవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం అనిత మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలు అనిత కుమార్తె ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సిబ్బందిని క్రమబద్ధీకరించాలి
- గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి

మహబూబాబాద్ రూరల్, జూన్ 21 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13వేల గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సుమారు 60 వేలమంది జీపీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. పెరిగిన ధరలకనుగుణంగా గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, బిల్ కలెక్టర్లు, కారోబార్‌లకు రూ.19500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22 వేలు వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతినెల 5వ తేదీన వేతనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులు నర్సింహా, సహాయ కార్యదర్శి రాందాస్, వెంకట్రాములు, సాంబశివుడు, సుబ్బయ్య, గట్టమ్మ పాల్గొన్నారు.

జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగించాలి


మహబూబాబాద్‌లో జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, జూన్21 : జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మానుకోట పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలోజయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్‌డోలి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం పరితపించిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. జయశంకర్ జీవిత చరిత్రను తెలంగాణ పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. టీఎస్జీవోస్ రాష్ట్ర నాయకుల పమ్మి రాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.కృష్ణప్రసాద్, శంకర్, పాష, ఇరుగు మనోజ్‌కుమార్, క్రిష్టారావు పాల్గొన్నారు.

● వీరభవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, తండా సందీప్, వెలుగు శ్రావణ్, లింగ్యానాయక్,లోకేష్, శంకర్, నారాయణ, వికాస్, వినయ్, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు. పట్టణంలోని శుభోదయం సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నీలం వెంకటేశ్వర్లు, మంగిలాల్, రమేష్, ప్రసాద్, విజయ్‌కుమార్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..


తొర్రూరులో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో నర్సింహారావు



మానుకోటలోని వీరభవన్‌లో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

● పెద్దవంగర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఎంపీపీ ఎర్ర సబితవెంకన్న, పోడిశెట్టి సైదులు, ఓరుగంటి సతీష్, దాసరిశ్రీనివాస్, వేణు, మహేష్, వినోద్, శ్రీనివాస్, పవన్, రాంబాబు, మల్లేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

● తొర్రూరు : ఆచార్య జయశంకర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆర్డీవో నర్సింహారావు అన్నారు. జయశంకర్ 13వ వర్ధంతి సందర్భంగా తొర్రూరులోని జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ప్రొఫెసర్ జయశంకర్‌కు ఉన్న పరిజ్ఞానం ఎంతో మందికి స్ఫూర్తిని ఇచ్చిందని కొనియాడారు. తహసీల్దార్ వినోద్ కుమార్, సీఐ సంజీవ, ఎస్సై జగదీష్, చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, రాము, నిరంజన్ రెడ్డి, కృష్ణప్రసాద్, శ్రీనివాస్, విక్రమ్, సోమ సత్తయ్య చారి తదితరులు ఉన్నారు.

ఇఫ్టూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్, జూన్21 : జిల్లా కేంద్రంలో లేబర్ కోడ్‌ల రద్దుకు ఈనెల 23న నిర్వహించే ఇఫ్టూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా రాష్ట్రాలు గొంతు విప్పాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. 1885 కార్మిక వర్గం పోరాడి సాధించిన ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేగా గుర్తింపు పొందిందని చెప్పారు. మోదీ ప్రభుత్వం దేశంలో 12 గంటల పనిదినాన్ని తీసుకురావడం, వేతనాలు, యూనియన్‌లు పెట్టుకునే హక్కును లేకుండా చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జె.సీతారామయ్య, శివ్వారపు శ్రీధర్, వీరభద్రం, నాగేశ్వర్‌రావు, మల్లయ్య, రాము పాల్గొన్నారు.

25న మహాసభ

● కేసముద్రం : కేసముద్రం మార్కెట్ ఆవరణలో ఈనెల 25న ఇఫ్టూ ఏరియా మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కన్నంతరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. కేసముద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం ఇఫ్టూ నిరంతరం పోరాడుతోందని, ఇందులో భాగంగా నిర్వహించే ఏరియా మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీవోపై చర్యలు తీసుకోవాలని ధర్నా


జీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కేసముద్రం, జూన్21 : కేసముద్రం మండల పంచాయతీ అధికారి తమను దూషించాడని ఆరోపిస్తూ కేసముద్రం స్టేషన్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం సీఐటీయూ అనుబంధ జీపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిబ్బంది ధర్నాకు దిగారు. ప్లకార్డులతో, నినాదాలతో గ్రామ పంచాయతీ కార్యాలయం హోరెత్తింది. ఈ సందర్భంగా జీపీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకన్న మాట్లాడుతూ తమ సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్‌ను ఎంపీవో దూషించడం హేయనీ యమైన చర్య అని ఖండించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ దామోదర్, ఎంపీడీవో రవికుమార్, ఎస్ఐ వంశీధర్ ధర్నా వద్దకు చేరుకొని మరోసారి ఇలా జరగకుండా చూస్తామని, ప్రతీనెల జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లయ్య, రాజమౌళి, తాడబోయిన శ్రీశైలం, చాగంటి కిషన్, జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్, ఉపాధ్యక్షుడు గంధసిరి వెంకటేశ్వర్లు, సుంచు కొమురయ్య, దుర్గాల వెంకన్న, నర్సింగ్‌బాస్, టేకుల శ్రీనివాస్, మడుపు కృష్ణమూర్తి, ఎండీ.అక్బర్, దర్శనం సాయిలు, బీరు కనకలక్ష్మి పాల్గొన్నారు.

రామాలయం రిజిస్ట్రేషన్‌పై వివాదం!?

(3వ పేజీ తరువాయి)

అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాక ఇటీవల గంధంపల్లిలోని రామాలయం వద్ద నిరసన తెలిపి, గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామస్తులు, భక్తులు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని గురువారం దేవాదాయశాఖ కార్యనిర్వాహణ అధికారిణి సునీతకు అందజేసినట్లు పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఆమె త్వరలోనే గ్రామాన్ని సందర్శించి విచారణ చేపడుతానని పేర్కొన్నట్లు వెల్లడించారు. కాగా, రిజిస్ట్రేషన్ గంధంపల్లి రామాలయం లేదా గంధంపల్లి-కొత్తపేట రామాలయంగా ఎలా మార్చినా తమకు అభ్యంతరం లేదని వారు ఈసందర్భంగా పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి భక్తులు, గ్రామస్థుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో గ్రామస్థులు, భక్తులు తమ్మిశెట్టి శ్రీను, రాయల రాజేష్, జనార్ధన్, ఉపేందర్, క్రిష్ణ, వెంకటేశర్లు, సుధాకర్, యాకయ్యలు ఉన్నారు. ఇదిలా ఉండగా రిజిస్ట్రేషన్ నిమిత్తం దేవాదాయశాఖ అధికారులు జారీ చేసిన నోటీస్‌ను సైతం పంచాయతీ కార్యాలయంలో సకాలంలో ప్రదర్శించకపోవడంపై వారు అనుమానాలు వ్యక్తపరుస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

'ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 21 : జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటుపాఠశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు సూర్యప్రకాష్, వెలు గు శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవా రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. మధు, జ్యోతిబసు, సింహాద్రి, లోకేష్ వెంకటేశ్, వికాస్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐని ఆదరించండి

మహబూబాబాద్ టౌన్, జూన్ 21 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల పక్షాన నిరంతరం పోరాడే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ని ఆదరించాలని ఆ పార్టీ మానుకోట అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి కోరారు. స్థానిక వీరభవన్‌లో మహబూబాబాద్ మండల సీపీఐ కౌన్సిల్‌ను శుక్రవారం నిర్వహించారు. తండా సందీప్, బానోత్ లింగ్యానాయక్, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, కొమ్ము నారాయణ, తండా సతీష్, తేజావత్ శ్రీనివాస్, వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేరడ విద్యార్థికి జఠాధర స్కాలర్‌షిప్

కురవి, జూన్ 21 : నేరడ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి కొండ సాయికుమార్‌కు జఠాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ స్కాలర్‌షిప్ లభించింది. ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులకు జఠాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ వారు సూపర్-20 స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో నేరడ విద్యార్థి కొండ సాయికుమార్ ప్రతిభచాటి స్కాలర్‌షిప్ దక్కించుకున్నారు. శుక్రవారం పాఠశాల హెచ్ఎం ఆర్.అరుణ విద్యార్థికి స్కాలర్‌షిప్ ధృవపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జఠాధర ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- షీటీం ఎస్సై సునంద

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 21 : అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై సునంద విద్యార్థినులకు సూచించారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ శివారు ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారంఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు కానీపరిచిత గ్రూపుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఏదైనా అభ్యంతరకర ఫోన్ కాల్స్‌వస్తే వెంటనే 1930, 100 డయల్ చేయాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చినపుడు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టి-సేఫ్ యాప్‌ను ప్రతీ మహిళ ఉపయోగించుకోవాలన్నారు. అపరిత వ్యక్తుల నుంచి అభ్యంతరకర ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వస్తే షీటీం వాట్సాప్ నెంబర్లను : 87126 56935, 79011 42009లను సంప్రదించాలన్నారు.

తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేసిన రీజినల్ మేనేజర్

- స్టాళ్ల నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం

తొర్రూరు, జూన్ 21 : వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను శుక్రవారం తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాల్‌ల నిర్వహణ, బస్టాండ్‌లో అపరిశుభ్రతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాల్స్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నారని, ఆర్టీసీ నిబంధనల మేరకే వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. వారికి కేటాయించిన స్థలంలో కాకుండా అదనంగా బస్టాండ్‌లో ప్లాట్ ఫామ్‌లపై వస్తువులు పెడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సౌకర్యం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ప్రయాణీకులు ఆర్ఎంకు ఫిర్యాదు చేశారు. మొదటిసారి తొర్రూరు డిపోకు వచ్చిన ఆర్ఎంకు ఆర్టీసీ కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంవో కె.భానుకిరణ్, డీఎం పద్మావతి, ఎస్టీఐ రజితా రెడ్డి, ఆర్టీసీ అధికారులు తదితరులు ఉన్నారు.

సీపీఎం నాయకుడి కన్నుమూత


వీరయ్య (ఫైల్)

గార్ల, జూన్ 21 : మండల పరిధిలోని బుద్దారం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు దొడ్ల వీరయ్య (52) అనారోగ్యంతో ఇంటివద్దనే మృతి చెందారు. గురువారం సాయంత్రం వీరయ్యకు శ్వాస ఆడక పోవడంతో ఇంటివద్దనే కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం అస్పత్రికి వీరయ్య తరలిస్తుండగా, మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, భాగం లోకేశ్వర్‌రావు, బట్ట లక్ష్మయ్య, మోహన్, వశ్య, ముత్స వెంకన్నలు వీరయ్య మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళ్లర్పించారు. మృతుడు వీరయ్యకు భార్య ఇరువురు కుమార్తెలు సంతానం. దీంతో ఆయన పెద్దకుమార్తె నాగశ్రీ తలకొరవి పెట్టింది. దీంతో వీరయ్య గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటో బోల్తా : మహిళకు తీవ్ర గాయాలు


గాయపడిన మహిళ

కొత్తగూడ, జూన్ 21 : ఆటో బోల్తాపడి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పొగుళ్లపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల ప్రకారం. కొత్తపల్లి గ్రామానికి చెందిన సునీత భవన నిర్మాణానికి కూలీ పనిచేసేందుకు కోనాపురంకు ఆటో లో వెళుతుంది. పొగుళ్లపల్లి గ్రామంలో ఆటోకు కుక్కలు అడ్డుగా రావడంతో వేగంగా ఉన్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. గ్రామస్తు లు వచ్చి ఆటోను లేపారు. మహిళ కూలీ సునీతకు తీవ్ర గాయాలు కావడంతో వేరే వాహనంలో కొత్తగూడలోని ఆస్పత్రికి తరలించారు.

కార్మిక సంఘాన్ని బలోపేతం చేయాలి

- టైల్స్ వర్కర్ జాతీయ అధ్యక్షుడు ఏసు

బయ్యారం, జూన్ 21 : ఎప్పటికప్పుడు కార్మిక ద్రోహాలను ఎండగడుతూ విప్లవ కార్మిక సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ టైల్స్ వర్కర్స్ జాతీయ అధ్యక్షుడు మరికుర్తి ఏసు అన్నారు. తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం బయ్యారంలోని గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. 40 ఏళ్ల క్రితం పెంకు కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు, వేతనాలు సాధించేందుకు దివంగత ముఖ్తార్ పాష ఆంధ్రప్రదేశ్ టైల్స్ వర్కర్స్ యూనియన్‌ను ఐఎఫ్‌టీయూకు అనుబంధంగా ఏర్పాటు చేశాడని గుర్తు చేశాడు. ఈ సమావేశంలో తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జే.సీతారామయ్య, రాష్ట్ర కార్యదర్శి ఏపూరి వీరభద్రం, జిల్లా కార్యదర్శి శ్రీధర్, నాయకులు బాలమల్లు, రాజు, పాష, రవీందర్, సోమిరెడ్డి, లింగయ్య, నాగేశ్వరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.


మానుకోటలో యోగా వేడుకలను ప్రారంభిస్తున్న జిల్లా ఆయుష్ ఇన్‌చార్జ్ డాక్టర్ నిరంజన్ జకోటియా


గూడూరు మండలం నాయకపల్లిలో పనిప్రదేశంలో యోగా ఆసనాలు వేస్తున్న ఉపాధి హామీ కూలీలు


కేసముద్రం స్టేషన్‌లో యోగా అక్షరాకారంలో కూర్చున్న విద్యార్థులు


తొర్రూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు

జిల్లా వ్యాప్తంగా యోగా దినోత్సవం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 21 : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రపంచ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా న్యాయస్థానం బార్ కౌన్సిల్‌హాల్లో నిర్వహించిన యోగా వేడుకలను నిర్వహించిరు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ మాట్లాడుతూ యోగా ఆసనాలు వేయడం వలన శరీరం తేలికై చేసే పనిలోను ఉత్సాహంగా ముందుకు సాగుతారని పేర్కొన్నారు. సీనియర్ సివిల్ జడ్జీ సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ తిరుపతి, బార్ సోసియేట్ ప్రెసిడెంట్, సభ్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకనూరి వెంకటేవ్వర్లు, కోర్టు పరిపాలన అధికారి క్రాంతికుమార్, సూపరింటెంట్ అమరేందర్, కోర్టు ఉద్యోగులు, జిల్లా న్యాయసేవా సాధికారత సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ జోగుల చెన్నయ్య మాట్లాడుతూ ఒత్తిడిని దూరం చేసి మానసకానందాన్ని, శారీరకంగా దృఢంగా మార్చే దివ్యఔషధమే యోగా అని పేర్కొన్నారు. ఏఆర్ డీఎస్పీ, సీఐలు దేవేందర్, శరవయ్య ఆర్ఐలు భాస్కర్, సోములు, ఎస్సైలు, సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు. గిరిజన భవన్‌లో జిల్లా ఆయూష్, యువజన క్రీడలశాఖ ల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా వేడుకల్లో సీనియర్ మెడికల్ ఆఫీసర్, జిల్లా ఆయూష్ ఇన్‌చార్జి డాక్టర్ నిరంజన్ జకోటియా పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, ప్రోగ్రా అధికారులు సుధీర్‌రెడ్డి, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఉషోదయా వాకర్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన యోగా వేడుకల్లో వాకర్స్ బాధ్యులు యోగా ఆసనాలు వేశారు. పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య, రవీంద్రగుప్తా, నల్లు సుధాకర్‌రెడ్డి, కల్లెం వెంకట్‌రెడ్డి, ఇమ్మడి కృష్ణమూర్తి, వాపరబోయిన శ్రీనివాస్, గోవర్ధన్, దాసరి ప్రసాద్, పమ్మి రాజు, నాళ్ల నరసింహారావు, పరందామయ్య, వెంకన్న, మార్కండేయులు, వేణు, కన్న నాగార్జున, లచ్చయ్య, దామోదరశర్మ, కుమార్, శ్యామ్ పాల్గొన్నారు. నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ రాజు, యోగా ఇన్‌స్ట్రక్టర్ కుసుమ రమేష్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రామారత్నమాల, శశికాంత్, మమత, యుగందర్, బొంద్యాలు, వేణుగోపాల్, మల్లేషం, రాజేందర్, సుజిత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, నరహరి, హతిరామ్, కాసీం, సుమన్, వీరు, సుమలతరెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో యోగా ఆసనాలు వేస్తున్న అదనపు ఎస్పీ చెన్నయ్య

వివిధ మండలాల్లో..

మహబూబాబాద్ మండలం గడ్డిగూడెం తండాలో ఉపాధిహామీ కూలీలు యోగ ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమేష్‌రెడ్డి,పంచాయతీ కార్యదర్శి నరేష్, ఎఫ్ఏ శంకర్, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

● మరిపెడ పీఎస్‌లో పోలీస్ ఆధ్వర్యంలో యోగా ఆసనాలు వేశారు. సీఐహత్తిరాంనాయక్, ఎస్సైలు సంతోష్, విజయ్‌రాంకుమార్, ఝాన్సీ, సిబ్బందితో పాటు హర్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ నిర్వాహకులు నరేందర్, జనార్ధనాచారి, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు. మరిపెడ బంగ్లాలోని సీతారాంపూర్ హైస్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగ అసనాలు వేశారు.

● చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామపంచాయతీలో కార్యదర్శి గుగులోతు సోమన్న, ఆదిబాబు, దాసరి యాకన్న, భద్రయ్యలు యోగాసనాలు వేశారు.

● నర్సింహులపేట హైస్కూల్ ఆవరణలో యోగ దినోత్సవాన్నిపురస్కరించుకుని ఎస్సై బి.సతీష్, సిబ్బంది, యువకులు యోగ ఆసనాలు వేశారు.

● కొత్తగూడలో బీజేపీ ఆధ్వర్యంలో యోగ డే నిర్వహించారు.ఈకార్యక్రమంలో ప్రవీన్, మధు, మురళి, హరిలాల్ పాల్గొన్నారు. అన్ని పాఠశాలల్లో యోగ డే నిర్వహించి ఉపాధ్యాయులు విద్యార్థులతో యోగ ఆసనాలు వేయించారు.

● గూడూరు మండలం నాయకపల్లిలో ఏపీవో భస్సీలాల్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలు యోగ ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో టీఏ యుగేందర్, ఎఫ్ఏ సునీత పాల్గొన్నారు.

● కేసముద్రం స్టేషన్‌లో హెచ్.ఎం.బి.రాజు, పీఈటీ కొమ్ము రాజేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, కుమారస్వామి, కృష్ణవేణి, యాదగిరి, శ్రీనివాస్, ఎం.సదయ్య, కేసముద్రం విలేజ్ శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా ఆసనాలు వేశారు.

● తొర్రూరులో : సంపూర్ణమైన ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరూ యోగా చేయాలని, యోగాతోనే మానసిక, శారీరక ఆరోగ్యం ఉంటుందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ మెడికల్ ఆఫీసర్ నిరంజని జకోటియా అన్నారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగా వేడుకలకు ఆమె హాజరై మాట్లాడారు. యోగా సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో, పోలీసుల ఆధ్వర్యంలో యతిరాజారావు పార్కులో యోగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ జయశ్రీ, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, వైద్యులు, విద్యార్థులు, సీఐ సంజీవ్, ఎస్సై జగదీష్, రాంజీనాయక్, డివిజన్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● బయ్యారం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బయ్యారం సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం యోగా డే నిర్వహించారు. అందులో భాగంగా బయ్యారం పోలీస్ స్టేషన్ నందు బయ్యారం, గార్ల ఎస్సైలు మౌలాన, జీనత్ కుమార్‌లతో పాటు బయ్యారం, గార్ల పోలీస్ సిబ్బంది పాల్గొని యోగా చేశారు.